ప్రారంభానికి నోచుకోని ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు



షాపూర్‌నగర్ ఫుట్‌ఓవర్ బ్రిడ్జికి అనుసంధానంగా ఏర్పాటు చేసిన ఎస్కలేటర్..



షాపూర్‌నగర్ చౌరస్తాలో ప్రమాదకరంగా రోడ్డు దాటుతున్న పాదచారులు..



షాపూర్‌నగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జి..

రంగారెడ్డినగర్: కోట్లాది నిధులు వెచ్చించి ఏర్పాటు చేసిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి (ఎఫ్‌ఓబీ)లు ప్రారంభానికి నోచుకోవడం లేదు. పాదచారులు సురక్షితంగా రోడ్లను దాటేందుకు వీలుగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రద్దీగా ఉండే ప్రాంతాల్లో జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీల ఆధ్వర్యంలో 34ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలను ఏర్పాటు చేశారు. కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల పరిధిలో షాపూర్‌నగర్-గాజులరామారం చౌరస్తాలో రూ.2కోట్ల జీహెచ్‌ఎంసీ నిధులతో, ఐడీపీఎల్ చౌరస్తాల్లో రూ.1.5 కోట్ల హెచ్‌ఎండీ నిధులతో ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలను నిర్మించారు. అయితే చాలా ప్రాంతాల్లో ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలను అవసరమైన చోట్ల ఏర్పాటు చేయకపోవడంతో పాదాచారులు వాటిని వినియోగించడం లేదు.. మరికొన్ని ప్రాంతాల్లో నెలలు కావస్తున్నా అందుబాటులోకి రావడం లేదు.. దీంతో రద్దీ రోడ్లపై పాదచారులు ప్రమాదకర పరిస్థితుల్లో రోడ్లను దాటాల్సి వస్తోంది.

పూర్తయి నెలలు కావస్తున్నా ప్రారంభానికి నోచుకోని వైనం..

ఆసియాలోనే అతి పెద్ద పారిశ్రామికవాడగా పేరొందిన జీడిమెట్ల పారిశ్రామికవాడ సమీపంలో ఉండటం, నర్సాపూర్ రాష్ట్ర రహదారి షాపూర్‌నగర్ ప్రాంతం మీదుగా వెళ్తుండటంతో బాలానగర్ మీదుగా మెదక్‌కు వెళ్లే వాహనాలతో ఈ ప్రాంతం రద్దీగా ఉంటోంది. దీంతో షాపూర్‌నగర్ చౌరస్తాలో రోడ్డు దాటాలంటే పాదాచారులకు గగనతరంగా మారుతోంది. ఈ నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో రూ.2 కోట్ల నిధులను వెచ్చించి గాజులరామారం- షాపూర్‌నగర్ చౌరస్తాలో 2022లో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనేక అవాంతరాలు మధ్య ఎట్టకేలకు ఆరు నెలల క్రితం ఎస్కలేటర్, లిఫ్ట్ సౌకర్యాలతో బ్రిడ్జి పనులు పూర్తి చేశారు. అయినా నేటికి పాదచారులకు అందుబాటులోకి తేవడం లేదు.

ప్రమాదకరంగా రోడ్డు దాటుతూ..

జీడిమెట్ల, గాంధీనగర్ పారిశ్రామిక ప్రాంతాలు సమీపంలో ఉండటంతో పాటు వివిధ పనుల నిమిత్తం గాజులరామారం, కైసర్‌నగర్, రోడామేస్త్రీ నగర్, ఉషోదయ కాలనీ, షాపూర్‌నగర్, చిత్తారమ్మదేవినగర్, వల్లబాయ్‌పటేల్‌నగర్ తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలు ప్రతినిత్యం షాపూర్‌నగర్ చౌరస్తా మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. గాజులరామారం వైపు నుంచి ఆటోల్లో వచ్చే ప్రజలు షాపూర్‌నగర్ ప్రాంతంలో రోడ్డు దాటేందుకు అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. చౌరస్తాలో సిగ్నల్స్ పడినా వెనుక నుంచి వచ్చే వాహనాలను దాటేందుకు కష్టతరంగా మారుతోంది. దీంతో బ్రిడ్జి పూర్తయినా అందుబాటులోకి రాకపోవడంతో పాదాచారుల కష్టాలు మాత్రం తీరడం లేదు.

మంత్రి రాక ఆలస్యంతోనేనా..!

రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలతో బిజీ బిజీగా ఉన్న పురపాలక శాఖా మంత్రి కేటీఆర్ కాల్‌షీట్ ఇవ్వకపోవడంతో షాపూర్‌నగర్ ఫుట్‌ఓవర్ బ్రిడ్జి ప్రారంభానికి నోచుకోవడం లేదని తెలుస్తోంది. తాజాగా ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటంతో ఇక షాపూర్‌నగర్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి ప్రారంభానికి మరో రెండు నెలలు వేచి చూడాల్సి వస్తుందని కొందరు అధికారులు పేర్కొంటున్నారు.

అక్కరకు రాని ఫుట్‌ఓవర్ బ్రిడ్జి..

ఐడీపీల్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని ప్రారంభించినా ప్రజలకు అంతగా ఉపయోగం ఉండటం లేదు. ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని సమీపంలోని బస్టాప్‌లకు దగ్గరగా ఏర్పాటు చేయకపోవడంతో సమీపంలోని ఆదర్శ్‌నగర్, సౌభాగ్యనగర్, ఏపీహెచ్‌బీ కాలనీ, సుమిత్రనగర్ తదితర ప్రాంతవాసులు అంత దూరం రాలేక రోడ్లపై డివైడర్లను దాటుతున్నారు. అంతే కాకుండా ఫుట్‌ఓవర్ బ్రిడ్జికి ఓ వైపు ఐడీపీఎల్ కాలనీ ప్రదేశం ఉండటం, ఫుట్‌ఓవర్ బ్రిడ్జికు ఏర్పాటు చేసిన లిఫ్టులు పని చేయకపోవడంతో వృద్ధులు మెట్లను ఎక్కేందుకు ఆసక్తి చూపడం లేదు. దీంతో రూ.1.5 కోట్లు వెచ్చించి ఫుట్‌ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేసినా ఆశించిన స్థాయిలో పాదాచారులకు ఉపయోగ పడటం లేదని, ఐడీపీఎల్ చౌరస్తాలోని చింతల్ వైపు రద్దీగా ఉండే ప్రాంతంలో ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని ఏర్పాటు చేసి ఉంటే ప్రజలకు ఉపయోగకరంగా ఉండేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



షాపూర్‌నగర్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి మెట్ల వద్ద మూసివేసిన షటర్..



రాకపోకలు సాగించకుండా అడ్డుగా ఉంచిన దృశ్యం..

క్లుప్తంగా

నిజాంపేట్ కాంగ్రెస్ ఫిషర్‌మెన్ చైర్మన్‌గా ఆగం శంకర్



భూపతిరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకుంటున్న ఆగం శంకర్

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఫిషర్‌మెన్ కాంగ్రెస్ చైర్మన్‌గా ఆగం శంకర్‌ను నియమిస్తూ మేడ్చల్ జిల్లా చైర్మన్ మహేశ్ ముదిరాజ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి చేతుల మీదుగా ఈ నియామక పత్రాన్ని ఆగం శంకర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆగం శంకర్ ముదిరాజ్ మాట్లాడుతూ... తనపై నమ్మకం ఉంచి అప్పగించిన బాధ్యతలను పూర్తి స్థాయిలో నిర్వహిస్తానని పేర్కొన్నారు. ముదిరాజ్‌లను ఐక్యం చేస్తూ ముదిరాజుల హక్కుల కోసం పోరాడుతూ కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేస్తానన్నారు.

బతుకమ్మ సంబురాలు



బతుకమ్మ ఉత్సవాల్లో విద్యార్థులు

నిజాంపేట్: విద్యార్థుల్లో చిన్నప్పటి నుంచే మన సంస్కృతి సంప్రదాయాలను నేర్పించాల్సిన అవసరం ఉందని... అందుకు పాఠశాలలు వేదిక కావాలని కేపీహెచ్‌బీ జోన్ ప్రగతినగర్ నారాయణ స్కూల్ ఏజీఎం వైజయంతి అన్నారు. సోమవారం ప్రగతినగర్‌లోని స్కూల్‌లో బతుకమ్మ సంబరాలను ఎంతో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రగతినగర్ స్కూల్ ప్రిన్సిపాల్ యమున, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ టికెట్‌ను వడ్డెర సామాజిక వర్గానికి కేటాయించాలి

కాచిగూడ: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ టికెట్‌ను బీసీ వడ్డెర సామాజిక వర్గానికి చెందిన తనకే కేటాయించాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు, అఖిల భారత వడ్డెర సంఘం జాతీయ ప్రధానకార్యదర్శి గుంజ శ్రీనివాస్ కర్ణాటక వడ్డెర సంఘం అధ్యక్షుడు తిప్పన్న ఒడియారాజ్ బోవితో ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గుంజ శ్రీనివాస్ మాట్లాడుతూ.. వడ్డెరల సంక్షేమానికి, ఓబీసీల హక్కుల సమస్యలపై అనేక పోరాటాలు చేసి పరిష్కారానికి కృషి చేశానని తెలిపారు. నిత్యం ప్రజల మధ్య ఉండే తనకు మంచి గుర్తింపు ఉందని, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో 40వేల వడ్డెర సామాజిక వర్గానికి చెందిన ఓట్లు ఉన్నాయని అన్నారు. వడ్డెర సమాజిక వర్గానికి న్యాయం చేస్తామని మల్లికార్జునఖర్గే హామీ ఇచ్చారని ఆయన తెలిపారు.

జన్మదిన శుభాకాంక్షలు



విజయరామిరెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ శంభీపూర్‌రాజు

కుత్బుల్లాపూర్: గాజులరామారం ఉషోదయ కాలనీలో మంగళవారం జరిగిన డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు విజయరామిరెడ్డి జన్మదిన వేడుకలకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

◆ శంభీపూర్‌లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల ప్రజలు ఎమ్మెల్సీని మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

కుత్బుల్లాపూర్: రాష్ట్రంలో కేసీఆర్ అవినీతి పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. మంగళవారం జహంగీర్ బస్తీకి చెందిన బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన 300 మంది హన్మంతరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణ ప్రాంత అభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్య పడుతుందన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సారథ్యంలో అధికారంలోకి వచ్చిన వెంటనే పేదలు ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.5లక్షల ఆర్థిక సహాయం అందజేస్తామని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపి గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఎమ్మెల్యేకు అండగా నిలుస్తాం



సుధాకర్‌గౌడ్‌తో కేక్‌కట్ చేయిస్తున్న ఎమ్మెల్యే



ఎమ్మెల్యే వివేకానంద్‌ను సత్కరించిన హమాలీలు

కుత్బుల్లాపూర్: తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, అవసరాలను నెరవేర్చే దిశగా గత పదేళ్లుగా సీఎం కేసీఆర్ పాలన కొనసాగించారని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల పారిశ్రామికవాడలో హమాలీల భవనానికి స్థలం కేటాయించిన నేపథ్యంలో మంగళవారం హమాలీ సంఘం నాయకులు పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా హమాలీలు మాట్లాడుతూ... గతంలో ఏ నాయకుడు తమ సమస్యలను పట్టించుకోలేదని, ఎమ్మెల్యే వివేకానంద్ అడిగిన వెంటనే హమాలీ భవనానికి స్థలం కేటాయించారన్నారు. హ్యాట్రిక్ సాధించేలా హమాలీలు అందరూ వచ్చే ఎన్నికల్లో వివేకానంద్‌కు అండగా నిలుస్తామన్నారు.

◆ రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు బాబుగౌడ్, జీడిమెట్ల డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు సుధాకర్‌గౌడ్, చింతల్ డివిజన్‌కు చెందిన బస్వరాజ్, గాజులరామారం డివిజన్ నాయకుడు సాయిబాబాల జన్మదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే వారితో కేక్‌లు కట్ చేయించి శుభాకాంక్షలు తెలియజేశారు.

కుత్బుల్లాపూర్ నుంచే పోటీ చేస్తా

కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్



నిజాంపేట్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచే తాను తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేస్తున్నట్లు ఆ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. సోమవారం బాచుపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... తెలంగాణలో ఎన్ని నియోజకర్గాల్లో తమ పార్టీ పోటీ చేయాలనే విషయాలను.. జనసేనతో పొత్తు విషయం తమ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడుతో ములాఖత్‌కు వెళ్లి వచ్చిన తరువాత ప్రకటిస్తామని అన్నారు. రాష్ట్రంలోని 30 స్థానాలకు తమ పార్టీ అభ్యర్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో తన విజయాన్ని ఎవరూ ఆపలేరన్నారు. ప్రజలను బీఆర్ఎస్ పార్టీ మభ్య పెడుతోందన్నారు. అన్ని వర్గాల ప్రజలు తనకు మద్దతుగా నిలుస్తారఅన్నారు. తెలంగాణలో టీడీపీ చేసిన అభివృద్ధే తమను గెలిపిస్తుందన్నారు. అన్ని వర్గాలకు తమ పార్టీ టిక్కెట్లు కేటాయిస్తుందని తెలిపారు. సామాజిక న్యాయం తమ పార్టీ సిద్ధాంతమన్నారు.

నూతన విద్యావిధానం అమలుకు శిక్షణ

రాయదుర్గం: జాతీయ నూతన విద్యావిధానం అమలు కోసం ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నట్లు న్యూఢిల్లీ సంస్కృత ఫౌండేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ చంద్‌కిరణ్ సలూజా పేర్కొన్నారు. మంగళవారం ఉర్దూ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ నిర్వహించిన ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ (ఐటీఈపీ), 'అన్‌వైలింగ్ న్యూ హరిజన్స్ ఇన్ టీచర్ ఎడ్యుకేషన్: ప్రాస్పెక్ట్స్ అండ్ ఛాలెంజెస్' అనే అంశంపై ఒక రోజు సదస్సు నిర్వహించారు. పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ చంద్‌కిరణ్‌సలూజా మాట్లాడారు. వీసీ సయ్యద్ ఐనుల్ హసన్ మాట్లాడుతూ నూతన విద్యావిధానం సహకార స్ఫూర్తిని పెంపొందిస్తుందన్నారు. అనంతరం సలూజాతో కలిసి వైస్‌చాన్స్‌లర్ ఉర్దూ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో మొక్కలు నాటారు.

ఇల్లు కూల్చేస్తామని భయపెట్టి వసూలు

- రూ.2లక్షల వరకు వసూలు చేసిన వైనం
- విషయం కార్పొరేటర్‌కు తెలియడంతో జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు



టౌన్ ప్లానింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన కార్పొరేటర్

జగద్గిరిగుట్ట: 'ఇల్లు కట్టి చూడు.. పెళ్లి చేసి చూడు.. ఎంత కష్టమో'అనే సామెత వింటుటాం. కాని ఎంత కష్టమో ఓ మహిళ తన ఆవేదన రూపంలో తెలియపరిచింది. ఎదిరించడానికి భర్త కూడా లేడు. ఇంకేముంది అధికారులు అందినంత దోచుకోవడమే తమ విధిగా పెట్టుకున్నారు. జగద్గిరిగుట్ట చర్చ్ రోడ్డులో ఉన్న ఓ భవనం పై అంతస్తులతో పనులు మొదలు పెట్టారు. జగద్గిరిగుట్ట పరిధిలో పర్మిషన్లు అనేవి ఇవ్వడం కుదరదు. దీనినే అదునుగా తీసుకొని ఇటు టౌన్‌ప్లానింగ్ అధికారి సంగీత, అటూ యూట్యూబ్ చానల్‌లకు సంబంధించిన వ్యక్తులు విలేకరులు అంటూ డబ్బులు కావాలని నిత్యం వేధించడం మొదలు పెట్టారు.

- **కిందకు దిగజారి మరీ డబ్బులు వసూలు**

మహిళ తమ కుటుంబంలో ఒకరు చనిపోతే వెళ్లానని చెప్పినా సరే... వదలకుండా గంటలో డబ్బులు తీసుకొని రాకపోతే కూల్చేస్తామని బెదిరించారు. చేసేదేమిలేక చావు దగ్గర నుంచి హడావిడిగా వచ్చి బంగారం బ్యాంక్‌లో కుదువ పెట్టి లక్ష రూపాయలు ఇచ్చేసింది. ఇక ఇదే విషయమై ఇతరుల నుంచి కూడా ఫిర్యాదులు వస్తున్నాయని వారికి కూడా డబ్బులు ఇవ్వాలని తెలిపింది. వాళ్ల కూడా వచ్చి లక్ష డిమాండ్ చేయడం.. చివరకు రూ.50వేలకు బేరం కుదుర్చుకొని తీసుకొని వెళ్లారు. ఇవే కాకుండా ఇంకా చాలా మందికి సుమారు రూ.50వేల వరకు ఇచ్చేసింది.

కార్పొరేటర్ సహాయంతో జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు..

మళ్లీ ఇంకా డబ్బులు కావాలని మరి కొంత మంది రావడంతో ఏమీ చేయాలో తెలియక స్థానిక కార్పొరేటర్ జగన్‌ను ఆశ్రయించింది. దీనిపై స్పందించిన కార్పొరేటర్ జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. సంబంధిత అధికారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై టౌన్ ప్లానింగ్ అధికారి సంగీతను ఫోన్‌లో సంప్రదించగా స్విచ్ ఆఫ్ వచ్చిందని తెలిపారు.

చెత్త రోడ్డు

చెత్తతో నిండిన ఎస్వీ కోఆపరేటీవ్ సొసైటీ రోడ్డు



జీడిమెట్ల: వాహనాలు, రాకపోకల కోసం ఏర్పాటు చేసిర రోడ్డు చెత్తాచెదారాలకు డంపింగ్ కేంద్రంగా మారింది. సదరు రోడ్డు గుండా నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. జీడిమెట్ల నుంచి ఎస్వీ కోఆపరేటీవ్ సొసైటీ, సుభాష్‌నగర్ ఇండస్ట్రీయల్ ప్రాంతానికి వాహనాలు లోడింగ్, అన్‌లోడింగ్ నిమిత్తం వస్తూ పోతూ ఉంటాయి. వివరాల్లోకి వెళ్తే జీడిమెట్ల ఫేజ్-1 నుంచి ఏస్వీకోఅపరేటీవ్ సొసైటీకి వెళ్లే రోడ్డులో ఈ దుస్థితి నెలకొంది. చెత్త డంపింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన ఏస్వీ కోఆపరేటీవ్, ఐలా అధికారులు తమకేమీ పట్టదు అన్నట్లుగా మౌనం వహిస్తున్నారు. నాలుగు సంవత్సరాలుగా ఇదే తీరు ఉన్నప్పటికీ అధికారుల్లో ఎలాంటి చలనం లేదు.

20ఫీట్ల రోడ్డు 8 ఫీట్ల రోడ్డుగా మారిన వైనం

అధికారులు వాహనాల రాకపోకల మేరకు 20ఫీట్ల సీసీ రోడ్డును ఐదేళ్ల క్రితం వేశారు. సదరు రోడ్డులో చెత్త డంపింగ్ ప్రక్రియ రోజు రోజుకు మితిమీరిపోయి రోడ్డుపై డంపింగ్ చేసే వరకు వచ్చింది. అధికారులు మొదట్లోనే చర్యలు తీసుకోకపోవడంతో డంపింగ్ చేసేవారు రెచ్చిపోయి రోడ్డుపై చెత్త పారబోస్తున్నారు. దీంతో రోడ్డు మొత్తం చెత్తరోడ్డుగా మారింది. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని చెత్త డంపింగ్‌కు పాల్పడే వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

పచ్చని మైదానం కాదిది!

ఫాక్స్‌సాగర్‌లో పెరిగిన గుర్రపు డెక్క



నగరంలో అతిపెద్ద చెరువులలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని జీడిమెట్ల ఫాక్స్ సాగర్ చెరువు ఒకటని చెప్పుకోవచ్చు. ప్రస్తుతం చెరువులో నగం మేర గుర్రపు డెక్క పేరుకు పోయింది. ఇటీవల ఎమ్మెల్యే చేప పిల్లలను కూడా వదిలారు. చేపలు బాగా పెరగాలంటే సంబంధిత అధికారులు గుర్రపు డెక్కను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

– సుభాష్‌నగర్

కోడ్ ఉల్లంఘనులపై కఠిన చర్యలు తప్పవు

కుత్బుల్లాపూర్: ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఉల్లంఘనలు జరుగకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎన్నికల రిట్నరింగ్ అధికారి పులి సైదులు అన్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో మంగళవారం కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా 16 టీమ్‌లను నియమించి వారికి దిశానిర్దేశనం చేశారు. గోడలపై పార్టీలకు సంబంధించి ప్రకటనలు చెరిపి వేయాలన్నారు. ప్రధాన రహదారులపై ఫ్లెక్సీలను తొలగించాలన్నారు. అదే విధంగా నగదు, మద్యం పంపిణీలపై నిఘా ఉంచి వాటిని కట్టడి చేయాలన్నారు. 16 టీమ్‌ల సభ్యులు నియోజకవర్గ వ్యాప్తంగా తిరుగుతూ ఉల్లంఘనలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.



సమావేశంలో ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులి సైదులు

ఫ్లెక్సీలు తొలగిస్తూ.. పెయింటింగ్‌లు చెరిపేస్తూ..







కోడ్ అమల్లోకి..

ఎన్నికల నగారా మోగడంతో ఆయా శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పేట్‌బషీరాబాద్, జీడిమెట్ల, జగద్గిరిగుట్ట, సూరారం, దుండిగల్, బాచుపల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలో చెక్ పోస్ట్‌లను ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలను చేపట్టారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్ల పరిధిలో గోడలపై ఆయా పార్టీ నాయకులకు చెందిన పెయింటింగ్‌లను తుడిచి వేస్తున్నారు. మరోపక్క స్తంభాలకు, రోడ్ల పక్కన ఉన్న రాజకీయ పార్టీ ఫ్లెక్సీలను తొలగిస్తున్నారు.

– సుభాష్‌నగర్